క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.3.50 లక్షలు



హుండీ సీల్ తీస్తున్న సిబ్బంది

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్) హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా నాలుగు నెలల కాలానికి గాను రూ.3,50,738 ఆదాయం సమోదైందని ఈఓ కె.సులోచన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.బేలిసింగ్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఈఓ



రజనీకుమారి, ఆలయ ఈఓ

పాల్వంచరూరల్: సెలవుపై వెళ్లిన పెద్దమ్మతల్లి ఆలయ ఈఓ రజనీకుమారి మూడు నెలల తర్వాత విధుల్లో చేరారు. కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ ఈఓ రజనీకుమారి మార్చి 15న సెలవుపై వెళ్లడంతో భద్రాచలం అంజనేయస్వామి ఆలయ ఈఓ జి.సుదర్శన్ ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. సెలవులు ముగించుకుని మంగళవారం ఈఓ బాధ్యతలు స్వీకరించారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీఓ నాయకులు



జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను టీఎన్‌జీఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, కార్యదర్శి కె.భార్గవ్ చైతన్య, కేంద్ర సంఘ కార్యదర్శి జి.వీరబాబు, కోశాధికారి జె.సోమయ్య, జాయింట్ సెక్రటరీ జి.ఉష, ఎస్.ఉషారాణి, ఎస్‌కె.జానీమియా, రాజు, నరసింహారావు, రాంబాబు, కబీర్, పవన్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై విచారణ చేపట్టాలి

ఇల్లెందు: నీట్ 2024 పరీక్ష ఫలితాలపై అవకతవకలపై విచారణ జరిపించాలని, మళ్లీ పరీక్ష నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జే.గణేష్ డిమాండ్ అన్నారు. మంగళవారం ఇల్లెందులో మాట్లాడుతూ... నీట్ ఫలితాల్లో స్కామ్ జరిగినట్లు దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆరోపిస్తున్న నేపథ్యంలో మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరారు. ఒకే పరీక్షలో ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు రావటం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు.

'సింగరేణి పాట' కోసం 21న ఆడిషన్స్

కొత్తగూడెంటౌన్: ప్రముఖ గాయకుడు మిట్టపల్లి సురేందర్ సింగరేణి సంస్థపై రచించి, సంగీతం అందించిన పాటను పారనంది ఈశ్వర ప్రసాద్ ఆలపించగా.. మరికొందరు సింగరేణి ప్రాంతీయులకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు మిట్టపల్లి స్టూడియో సీఈఓ పుల్ల సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కళాకారుల ఎంపికకు ఈనెల 21న కొత్తగూడెంలో ఆడిషన్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు 91105 30053 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎర్రవాగు ప్రాజెక్ట్‌ను కాపాడండి..



వినతిపత్రం అందజేస్తున్న దుర్గాప్రసాద్

జూలూరుపాడు: కాకర్ల ఎర్రవాగు ప్రాజెక్ట్ చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతూ గోర్ బంజారా పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ మంగళవారం తహసీల్దార్ కె.స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాకర్ల ఎర్రవాగు ప్రాజెక్టు చెరువు సరిహద్దులను గుర్తించి, ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- పెరుగుతున్న బాధితులు
- అవగాహన కల్పించాలంటున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు



పెద్దమ్మ గుడి వద్ద వీధి కుక్కల గుంపు

పాల్వంచరూరల్: మండలంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే పెద్దమ్మ గుడి వద్ద అయితే వీధి కుక్కల సంతతి బాగా పెరిగింది. కుక్కకాటుకు గురవుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో మండల, మున్సిపాలిటీ పరిధిలో సంచరించే వీధికుక్కలను ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వీధికుక్కలను పట్టుకుని వాటికి సంతానోత్పత్తి కలగకుండా శస్త్రచికిత్సలు చేసి కుక్కను ఎక్కడ నుంచి పట్టుకొచ్చారో అదే ప్రాంతంలో తిరిగి వదిలేస్తామన్నారు. కానీ అమలు చేయడం లేదు. దీంతో కుక్కలు సంవత్సరానికి రెండుసార్లు పదుల సంఖ్యలో పిల్లలను పెట్టడంతో కుక్కల సంఖ్య అధికమవుతోంది. కుక్కలు, కోతులు, ఎలుకల కాటుతో వాటి నోటిలోని ద్రవాల ద్వారా మనుషులకు, పశువులకు రేబిస్ వ్యాధి వ్యాపిస్తుంది.

గాయమైతే పెద్దాస్పత్రికి వెళ్లాల్సిందే...

జగన్నాథపురం, ఉల్వనురు గ్రామంలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. మండల కేంద్రమైన పాల్వంచ పట్టణంలో ఏరియా ఆస్పత్రి ఉంది. అయితే చిన్నపాటి గాయలైతే మాత్రం రేబిస్ వ్యాక్సిన్ వేసి పంపిస్తున్నారు. పెద్దగాయమైతే మాత్రం పెద్దాస్పత్రులకు పరుగులు పెట్టాల్సిందే. దీంతో బాధితులు పడరానిపాట్లు పడుతున్నారు. మండలంలో ఏ గ్రామంలో చూసినా వీధికుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయి. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో వీధికుక్కలను పంచాయతీలో పట్టి ఎనిమల్ కేర్‌కు తరలించారు. కానీ ఇప్పుడు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు పీహెచ్‌సీలలో కుక్క కరిస్తే రేబిస్ వ్యాక్సిన్ వేసి చికిత్స చేస్తున్నారు. పెద్దగాయమైతే ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. పెద్దలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లి చికిత్స చేసుకోవాలంటే భారంగా మారుతోంది. అడవి జంతువులు దాడి చేసి గాయపరిచినా కుక్క కాటు వ్యాక్సినే వేస్తున్నారు.

నాటు వైద్యమే దిక్కు..

ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని గిరిజన గ్రామాల్లో కుక్క కరిస్తే ఆకు పసరుతో నాటు వైద్యం చేసుకుంటున్న పరిస్థితి కూడా ఉంది. గిరిజనులకు అవగాహన లేక కుక్క కరిసిన, పాము కాటు వేసి, కోతి కరిసి ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకునే స్థోమత లేక నాటు పసరుతో సొంత వైద్యం చేసుకుంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అవగాన కల్పించి గిరిజనులను చైతన్య పరిచే నాథుడే లేక ఇవే పద్ధతులు పాటిస్తున్నారు.

ఐదు నెలల్లో 576 మంది బాధితులు...

మండలంలో జనవరి నుంచి మే వరకు కుక్క కాటుకు గురై జగన్నాథపురం పీహెచ్‌సీలో చికిత్స పొందిన బాధితులు జనవరిలో 18, ఫిబ్రవరి 24, మార్చి 13, ఏప్రిల్ 17, మే 25 మంది ఉల్వనూరు పీహెచ్‌సీలో జనవరిలో 16, ఫిబ్రవరి 6, మార్చి 8, ఏప్రిల్ 5, మే7 మంది ఏరియా ఆస్పత్రుల్లో జనవరి 49, ఫిబ్రవరి 93, మార్చి 86, ఏప్రిల్ 112, మే 93 మంది కుక్క కాటుకు చికిత్స పొందారు.

చర్యలు తీసుకోవాలి..



మండలం మొత్తంలో ఎన్ని కుక్కలు ఉంటాయో అంతకంటే ఎక్కువగా పెద్దగుడి చుట్టే ఉన్నాయి. వాటి సంతతిని నియంత్రించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వాటిని నియంత్రించేందుకు ప్రత్యేక కేర్ సంటర్‌ను మండలంలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– గంధం ఏడుకొండలు, కేశవాపురం

ప్రజలను రక్షించాలి...



గ్రామీణ ప్రాంతాల్లో వీధికుక్కల సంచారం ఇటీవల బాగా పెరిగిపోయింది. పల్లెల్లో కుక్క కాటు బాధితులు పెరిగిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలి.

– రాంబాబు, లక్ష్మీదేవిపల్లి

ప్రథమ చికిత్సే ప్రధానం



రేబిస్‌కు ప్రథమ చికిత్సే ప్రధానం. కుక్క, పిల్లి వంటి జంతువుల ద్వారా మనుషులకు, పశువులకు సంక్రమించే వైరస్ వ్యాధి రేబిస్. బాధితులు నాటు మందు, పసర్లు తీసుకని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆస్పత్రికి వెళ్లి యాంటీ వైరస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.

– డాక్టర్ రాజు, జగన్నాథపురం పీహెచ్‌సీ

'నిమ్మల'కు నివాళి



నివాళులర్పిస్తున్న జడ్జి పాటిల్ వసంత్, న్యాయమూర్తులు, న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: ఇటీవల మరణించిన సీనియర్ న్యాయవాది నిమ్మల సోమిరెడ్డికి కొత్తగూడెం జిల్లా కోర్టులో మంగళవారం నివాలర్పించారు. ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, న్యాయమూర్తులు, న్యాయవాదులు నిమ్మల సోమిరెడ్డి మరణానికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి, బత్తుల రామరావు, న్యాయమూర్తులు కె.సాయిశ్రీ, వి.శివానాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వెలగల నాగిరెడ్డి, రావి విజయ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు ఇఫ్టూ మహాసభ

జూలూరుపాడు: 20న జూలూరుపాడులో జరగనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) కొత్తగూడెం ఏరియా మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభ కరపత్రాలను కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఇఫ్టూ అన్ని వర్గాల కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తుందన్నారు. సభను విజయవంతం చేసేందుకు కార్మికులు తరలిరావాలని కోరారు. రాయల సిద్ధు, ధనవంతరావ్, రాజు, వెంకటమ్మ, రాము, భీమా, సురేష్ పాల్గొన్నారు.

జీతాలివ్వండి..



సీడీపీఓకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: ఐసీడీఎస్ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్ వేతనాన్ని వెంటనే అందించాలని ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో మంగళవారం పాల్వంచ సీడీపీఓ రేవతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ మాట్లాడుతూ... ప్రతీనెల 14వ తేదీన ఇవ్వాల్సిన వేతనం రెండో నెల అయినా ఇవ్వలేదన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలు ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు, గ్యాస్ బిల్లులు, ఆరోగ్యలక్ష్మి బిల్లులు, టీఏ, డీఏ, ఇన్సూరెన్స్, రూ.10లక్షల హెల్త్ కార్డులు అందించాలన్నారు. తాగునీరు, కరెంట్, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. పందుగ వెంకట రమణ, సోయం రాజ్యలక్ష్మి, ఉమాదేవి, పద్మ, లాలి, భవానీ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: మిషన్ భగీరథ సర్వేను నిర్దేశించిన గడువులో ఇంటింటికీ తిరిగి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తోగ్గూడెం, జగన్నాథపురం గ్రామాల్లో మంగళవారం మిషన్ భగీరథ యాప్ సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది సర్వే నిర్వహిస్తున్న ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమలో తోగ్గూడెం కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మిషన్ భగీరథ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ వారీగా మిషన్ భగీరథ సర్వేపై వివరాలు తెలుసుకున్న ఆయన వేగవంతంగా చేయాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామాలలో పారిశుద్ధ్య పనులపై కూడా దృష్టి సారించాలని సూచించారు.

మురుగు కాల్వలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ చెత్త తొలగింపు పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నోడల్ అధికారి ప్రభుదయాళ్ అన్నారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభుదయాళ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, అందుకు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

ఇల్లెందు: పట్టణంలో రోడ్డు పక్కన కూరగాయల విక్రయాలు, తైబజార్ -2024 సంవత్సరానికి వేలం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ యాదగిరి తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ... టెండర్‌లో పాల్గొనేందుకు 19వ తేదీ నుంచి 22 వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ పనివేళల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు పొందాలని, 24న సాయంత్రం 4 గంటలకు వేలంపాటలో పాల్గొనాలని ధరావత్తుగా రూ.3.50 లక్షలు కమిషనర్ పేరు మీద డీడీ తీసి అందజేయాలని చెప్పారు. వివరాలకు 9666333359లో సంప్రదించాలని కోరారు.

రామోజీరావు సంతాపసభ

సింగరేణి(కొత్తగూడెం): మీడియా రంగంతో పాటు ఇతర సంస్థలు స్థాపించిన రామోజీరావు పలువురికి ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా అన్నారు. చుంచుపల్లిలో మంగళవారం నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించాక సాబీర్‌పాషా మాట్లాడారు. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు: ఇటీవల క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మృతి చెందిన పట్టణంలోని నంబర్ 2 బస్తీకి చెందిన రవికిరణ్ కుటుంబానికి క్రికెట్ క్రీడాకారులు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం క్రికెట్ క్రీడాకారులు సాయికుమార్, సీహెచ్ రమేష్, మోకాళ్ల శేఖర్, సుధీర్‌కుమార్, యాకూబ్, సాయి వంశీ, సాయి కిరణ్‌లు మృతుడు రవికిరణ్ ఇంటికి వెళ్లి రూ.25 వేల నగదు, బియ్యం అందజేశారు. రానున్న కాలంలో ఆ కుటుంబానికి అండగా ఉంటామని మరింత సాయం అందిస్తామని భరోసా కల్పించినట్లు క్రీడాకారులు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ 27వ వార్డులో ఇళ్ల మధ్యలో టవర్ ఏర్పాటు చేయడానికి వ్యతిరేకిస్తూ ఆ వార్డు ప్రజలు మంగళవారం కొత్తగూడెం మున్సిపాలిటీ కమిషనర్ శేషాంజన్ స్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ... టవర్ ఏర్పాటును ఆపాలని, దాని వలన వార్డు ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కోటా శివశంకర్, బొబ్బల వెంకట్, సంకెళ్ల రామ్‌బాబు, డిష్ సత్తి, రమేష్ పాల్గొన్నారు.

కార్మికులను పర్మనెంట్ చేయండి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

పాల్వంచ: మున్సిపాలిటీ కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. మంగళవారం స్థానిక చంద్ర రాజేశ్వర్‌రావు భవన్‌లో మున్సిపల్ కార్మికుల సర్వసభ్య సమావేశాన్ని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ... కార్మికులకు రూ.24వేలు వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పనిభారం తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, బండి నాగేశ్వరరావు, ఉప్పు శెట్టి రాహుల్, ఇట్టి వెంకట్రావ్, ఉపేంద్రాచారి, జక్రయ్య, లాల్‌పాషా, గంగపురి వెంకన్న, నాగేశ్వరరావు, ప్రసాద్, శివరామకృష్ణ, కృష్ణ, రంగయ్య, ముత్తమ్మ, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



పుస్తకాలు అందజేస్తున్న కంచర్ల చంద్రశేఖర్‌రావు

కొత్తగూడెంరూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీ గ్రామ పంచాయతీలో ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అధిక ఫీజుల బారి నుంచి బయటపడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని కల్పిస్తున్న ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.జ్యోతిరాణి, విద్యాశాఖ అధికారి బి.జుంకీలాల్, టీచర్ శౌరి ఇన్నయ్య, నోట్ పుస్తకాల దాతలు నాగరాజు, ప్రమీల పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, లగడపాటి రమేష్, ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ ఉమెన్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలు సూరి మెహరున్నీసా, లోగాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న హరిణి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా కేసీఓఏ క్లబ్‌లో మంగళవారం సింగరేణి ప్రధానాస్పత్రి వైద్యులు ఉమెన్ హెల్త్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సింగరేణి లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ డి.హరిణి సత్యనారాయణరావు, విశిష్ట అతిథిగా ఏసీఎంఓ విక్టర్ వందనం హాజరయ్యారు. మాట్లాడుతూ... సింగరేణి ఆస్పత్రి సిబ్బంది ఏర్పాటు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 70 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (ఐటీ) హరిశంకర్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాలతి, సీనియర్ పీఓ ఎం.శ్రీనివాస్, లేడీస్ క్లబ్ సెక్రటరీ జానకి పాల్గొన్నారు.

వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిబంధనలకు విరుద్ధంగా అక్రమ పద్ధతిలో బాధ్యతలు చేపట్టి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వైద్యాధికారి, డీసీహెచ్‌ఎస్‌లను బాధ్యతల నుంచి తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ..

టెండర్ ప్రక్రియ లేకుండా కాంట్రాక్ట్ పనులు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నియామకాలు, డిప్యూటేషన్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ, సాయి, మురళి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాం..



ప్రెసిడెంట్‌గా ఎన్నికైన దస్తగిరి

కొత్తగూడెంటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో మంగళవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా లయన్ పూర్ణచందర్‌రావు పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా పీఎస్‌టీ కమిటీలో ప్రెసిడెంట్‌గా ఎస్‌కే దస్తగిరి, సెక్రటరీగా లగడపాటి రమేష్, ట్రెజరర్‌గా చెరుకు శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో లయన్ ఆముదాల వెంకట నర్సయ్య, మోడెం మోహన్‌రావు, కోనేరు నాగేశ్వరావు, శ్రీధర్‌రావు, మైనేని మోహన్‌చంద్ర, మధు మోహన్‌రావు, చెరుకు శ్రీనివాస్, మన్నెం జవహర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న కృష్ణ తదితరులు

ఇల్లెందురూరల్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇల్లెందు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సత్యనారాయణను పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, చీమల వెంకటేశ్వర్లు, కొర్స కోటయ్య మంగళవారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

'అంగన్‌వాడీ'ల సమస్యలు పరిష్కరించాలి



టేకులపల్లి: సీడీపీఓకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



సింగరేణి(కొత్తగూడెం): ఐసీడీఎస్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అంగన్‌వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. ఐసీడీఎస్ 1975 ఏర్పడిన నాటి నుంచి గౌరవ వేతనం పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తూ చాలీచాలని వేతనాలతో భారంగా జీవిస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు, హెల్పర్లకు రూ.21వేలు ఇవ్వాలని పలుమార్లు పోరాటాలు చేస్తున్నా స్పందించటం లేదన్నారు. ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, లేదంటే ఆందోళనలు ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు.

టేకులపల్లి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా నాయకురాలు వై.ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీడీపీఓ కేఎం తారకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఇందిర మాట్లాడుతూ... ఐసీడీఎస్‌లో 1975 నుంచి గౌరవ వేతనం పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చేస్తున్నామన్నారు. చాలీచాలని తక్కువ వేతనం పొందుతూ కుటుంబ పోషణ భారంగా జీవితాలను వెళ్లదీస్తున్నామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు, హెల్పర్లకు రూ.21వేలు ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 24 రోజుల పాటు రాష్ట్ర వ్యాపితంగా చేసిన సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు రూ.18వేలు, హెల్పర్లకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పైన తెలిపిన వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష అమలు చేయాలన్నారు. సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, టీఏ, డీఏలు అందించాలని, అంగన్‌వాడీ టీచర్లకు ట్యాబ్‌లు ఇవ్వాలని, అదనపు యాప్స్‌ని రద్దు చేయాలని, బీఎల్‌ఓ డ్యూటీలను రద్దు చేయాలని, పెండింగ్ ఇంటి అద్దెలు, గ్యాస్ తదితర బిల్లులు చెల్లించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా సొంత భవనాలు నిర్మించాలని, టాయిలెట్స్, తాగు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.నీరజ, కె.రాంబాయి, ఎన్.రమాశ్రీ,వి.సంధ్యారాణి, ఎన్.విజయలక్ష్మి పాల్గొన్నారు.